
సాక్షి
నల్లగొండ
శుక్రవారం ¦ 18 ¦ జూలై ¦ 2025



'సుంకిశాల' పూర్తయ్యేదెన్నడో?
హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు చేపట్టిన సుంకిశాల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. - 8లో



'ఫైర్' సేవలు అభినందనీయం
అగ్నిమాపక సిబ్బంది తెగువ అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	561.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	69,522 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	6,314 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	4,419 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,650 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నీలగిరికి 355వ ర్యాంక్

నల్లగొండ టూటౌన్ : కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీల స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను గురువారం ప్రకటించింది. మూడు లక్షలలోపు జనాభా కేటగిరిలో నీలగిరి మున్సిపాలిటీ 355వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో 56వ ర్యాంకు సొంతం చేసుకుంది. చెత్త ప్రాసెసింగ్, ఇంటింటి చెత్త సేకరణలో మెరుగైన ఫలితాన్ని రాబట్టింది. డంపింగ్ యా ర్డులో చెత్త రీసైక్లింగ్ పెండింగ్ కారణంగా జాతీయస్థాయి ర్యాంకులో కాస్త వెనుకబడింది. ఉమ్మడి జిల్లాలో పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణలో ప్రతి సంవత్సరం ముందంజలో నిలుస్తున్నప్పటికీ, డంపింగ్ యార్డ్ చెత్త కారణంగా ఆశించిన స్థాయిలో ర్యాంకు సాధించలేకపోయింది.

నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ రఘువర్ధన్ సస్పెన్షన్

నల్లగొండ : నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ రఘువర్ధన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. చిట్యాలకు చెందిన ఓ బాలిక పేరున ఉన్న 121 గజాల భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ రిజిస్ట్రార్ 2పైన కూడా పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినా.. పాత పద్ధతిలోనే అక్రమాలు జరుగుతుండడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నలుగురు ఎంపీడీఓలకు పోస్టింగ్ ఆర్డర్లు



జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న ఎంపీడీఓలు

నల్లగొండ : ఇతర జిల్లాల నుంచి నల్లగొండకు బదిలీపై వచ్చిన నలుగురు ఎంపీడీఓలకు గురువారం జిల్లా పరిషత్ సీఈఓ శ్రీనివాసరావు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వచ్చిన బి.యాకుబ్ నాయక్‌ను నల్లగొండ ఎంపీడీఓగా, డి.జితేందర్‌రెడ్డిని వేములపల్లి ఎంపీడీఓగా, సూర్యాపేట జిల్లా నుంచి వచ్చిన జె.వెంకటేశ్వర్‌రావును నకిరేకల్ ఎంపీడీఓగా, సంగారెడ్డి నుంచి వచ్చిన ఎస్.సుధాకర్‌ను తిప్పర్తి ఎంపీడీఓగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పు రాంబాబు, ఇతర అధికారులు ఉన్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.22,90,630



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు విచ్చేసి స్వామి వారికి మొక్కుబడిగా 34 రోజుల్లో సమర్పించిన కానుకల హుండీలను గురువారం లెక్కించారు. మొత్తం 22,90,630 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. అన్నదానం హుండీని లెక్కించగా రూ65,120 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజయ్య, వెంకటయ్య, రాజలక్ష్మి, వంశీ, నరేష్, చైర్మన్ మేకల అరుణారాజిరెడ్డి, డైరెక్టర్లు మారుపాక ప్రభాకర్‌రెడ్డి, పసునూరి శ్రీనివాస్, వంపు శివశంకర్, రాధారపు భిక్షపతి, బొబ్బలి దేవేందర్, మేక వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, కొండేటి వేణు, యాదయ్య, యాదగిరి, శ్రీను, శంకరయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్, లోన్ యాప్‌లను అరికట్టాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. సైకిల్ యాత్ర కరపత్రాలను గురువారం నల్లగొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సైకిల్ యాత్ర ఈ నెల 24 నుంచి నకిరేకల్‌లో ప్రారంభమై, ఆగస్టు 2న మిర్యాలగూడలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు వడ్డగాని మహేష్, కట్ట లింగస్వామి, బి.లింగరాజు, అలివేలు పాల్గొన్నారు.

అలరించిన నాటకాలు



నల్లగొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటకోత్సవాల్లో భాగంగా 'సంధ్యా వెలుగు' నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



'స్వేచ్ఛ' నాటకంలోని ఓ సన్నివేశం

వడ్డీ వచ్చేసింది!

మూడేళ్ల తర్వాత మహిళా సంఘాలకు వడ్డీ బకాయి విడుదల

- ఉమ్మడి జిల్లాకు రూ.38.63 కోట్లు కేటాయింపు
- మహిళా సంఘాల హర్షం
- ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పంపిణీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మహిళా సంఘాలకు వడ్డీ బకాయిలు మంజూరయ్యాయి. మూడేళ్లుగా రుణాలు తీసుకొని అసలు, వడ్డీ సక్రమంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీ బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తుంది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళల సంఘాలకు రూ.38.63 కోట్లు విడుదల చేసింది. విడుదలైన వడ్డీ బకాయిల్లో నల్లగొండ జిల్లాలోని మహిళ సంఘాలకు రూ.20.80 కోట్లు, సూర్యాపేటకు 5.43 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాకు రూ.12.40 కోట్లు ఇచ్చేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆ వడ్డీ బకాయిలను ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి సంబురాల ముగింపు సమావేశంలో శుక్రవారం అందజేసేలా ఏర్పాట్లు చేసింది. దీంతో ఆయా మహిళ సంఘాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

వడ్డీ పంపిణీ వివరాలు ఇలా..

జిల్లా	వడ్డీ పొందే సంఘాలు	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)
నల్లగొండ	19,390	20.80
సూర్యాపేట	10,603	5.43
యాదాద్రి	11,209	12.40
మొత్తం	41,202	38.63

రుణాలు సక్రమంగా చెల్లించిన సంఘాలకే..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 70 వేల వరకు స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు, వారు చేసే వ్యాపారాలు ఇతరత్రా పనులకు పోత్సాహం అందించేందుకు ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తోంది. అయితే బ్యాంకులనుంచి రుణాలను తీసుకున్న సంఘాలు ఆ రుణాలను క్రమం తప్పకుండా ప్రతి నెలా వడ్డీతో సహా బ్యాంకుల్లో చెల్లించాలి. అలా చెల్లించిన మహిళా సంఘాలకే ప్రభుత్వం ఆ వడ్డీని తిరిగి మహిళా సంఘాల ఖాతాలో జమ చేస్తుంది. ఇలా నల్లగొండ జిల్లాలో 19,390, సూర్యాపేటలో 10,603, యాదాద్రి జిల్లాలో 11,209 సంఘాలు సక్రమంగా రుణాలు చెల్లించాయి. ఆయా సంఘాలన్నింటికీ ప్రభుత్వం వడ్డీ బకాయిలను విడుదల చేసింది.

మూడేళ్లుగా అందని వడ్డీ

మూడేళ్ల నుంచి మహిళా సంఘాలకు వడ్డీ బకాయిలు అందడం లేదు. తీసుకున్న రుణాన్ని బ్యాంకుల్లో సకాలంలో చెల్లించిన వెంటనే ప్రభుత్వం ఆ మహిళా సంఘాలకు వడ్డీ చెల్లించాలి. కానీ మూడేళ్లుగా వడ్డీ బకాయిలు పేరుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర పూర్తయింది. దీంతో ప్రభుత్వం వాటిని విడతల వారీగా ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలోని ఆయా సంఘాలకు రూ.38.63 కోట్లు విడుదల చేసింది. అయితే జిల్లాల్లో మహిళ సంఘాలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికి సకాలంలో ఆయా రుణాలను వడ్డీతో సహా చెల్లించిన సంఘాలు 41 వేలకుపైగా ఉన్నాయి. ఆయా సంఘాలకు ఇప్పుడు వడ్డీ బకాయిలు అందనున్నాయి.

నేడు సాగర్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి రాక

- జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించనున్న భట్టి విక్రమార్క
- సాగర్, వైటీపీఎస్ విద్యుదుత్పత్తిపై సమీక్ష

నాగార్జునసాగర్ : రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం నాగార్జునసాగర్‌ను సందర్శించనున్నారు. సాగర్, యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో విద్యుదుత్పాదనపై సమీక్షించనున్నారు. ముందుగా సాగర్ జల విద్యుత్‌కేంద్రాన్ని పరిశీలించనున్నారు. సాగర్ ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో రోజుకు 17–18 మిలియన్ యూనిట్ల జరుగుతుంది. గతేడాది వరదలు చాలారోజులు రావడంతో విద్యుదుత్పాదన భారీస్థాయిలో జరిగింది. నిర్ణయించిన సమయం కన్నా ముందుగానే లక్ష్యాన్ని చేరారు. ఇక దామరచర్ల సమీపంలో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 4వేల మెగావాట్ల విద్యుదుత్పాదన జరుగనుంది. పనుల ఆలస్యంతో పూర్తిస్థాయిలో ఉత్పత్తి కావడం లేదు. ఈ అంశాలపై ఇంజనీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉప ముఖ్యమంత్రికి వివరించనున్నారు. అనంతరం అధికారులతో ఆయన సమీక్షించనున్నారు.

నేటి నుంచి రేషన్‌కార్డుల పంపిణీ

- నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు అందించనున్న ఎమ్మెల్యేలు
- నేడు నకిరేకల్‌లో.. 19న నల్లగొండ, 22న దేవరకొండ, మునుగోడులో పంపిణీకి ఏర్పాట్లు

నల్లగొండ : రేషన్‌కార్డులను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా.. లబ్ధిదారులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని ఆదేశాలు రావడంతో.. అధికారులు ఆ మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేలు ఇచ్చిన సమయానికి కార్డులు పంపిణీ చేసేలా సన్నద్ధమవుతున్నారు.

58 వేల కొత్త రేషన్‌కార్డులు..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో అర్హులకు రేషన్ కార్డులు అందిస్తోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 58 వేల రేషన్‌కార్డులు కొత్తగా సిద్ధమయ్యాయి. వాటిని శుక్రవారం నుంచి లబ్ధిదారులకు అందించనున్నారు.

కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హులైతే రేషన్‌కార్డులను మంజూరు చేస్తాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.
– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

నియోజకవర్గాల వారీగా కార్యక్రమాలు ఇలా..

- నకిరేకల్‌లో శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ఆధ్వర్యంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.
- నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించిన రేషన్‌కార్డులను ఈ నెల 19న మంత్రి కోమటిరెడ్డి లబ్ధిదారులకు అందించనున్నారు. ఇందు కోసం నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.
- 22వ తేదీన దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలునాయక్, మునుగోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు.
- మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇచ్చే సమయం ఆధారంగా పంపిణీ చేయనున్నారు.

విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులు అనారోగ్యం పాలు కాకుండా వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు వారిని సొంత పిల్లలుగా చూసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం ఆమె నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను అమలు చేస్తామని తెలిపారు. వార్డెన్ల ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరుకాకపోతే వారి జీతాన్ని నిలిపివేస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఉదయం నుంచి రాత్రి వరకు వార్డెన్లు హాస్టల్‌లో ఉండాలని, తప్పనిసరిగా మెనూ పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దన్నారు. ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే సంబంధిత అధికారులను ఉద్యోగం నుంచి తొలగిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఈఓ భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపులో విమర్శలకు తావివ్వొద్దు

మిర్యాలగూడ : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి విమర్శలు, ఆరోపణలకు తావు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గురువారం దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఇంటి గ్రౌండింగ్ మొదలుకొని నిర్మాణం పూర్తయ్యేంతవరకు పూర్తి పారదర్శకత ఉండాలన్నారు. నిబంధనలకు లోబడి నిర్మించుకున్న వారికి మాత్రమే బిల్లులు చెల్లింపు ఉంటుందన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, డీసీఓ పత్యానాయక్, తహసీల్దార్ జవహర్‌లాల్ తదితరులు ఉన్నారు.

టెయిల్‌పాండ్‌ను సందర్శించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రం సమీపంలో గల కృష్ణానదిపై నిర్మించిన టెయిల్‌పాండ్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించి ఇందిరమ్మ ఇండ్లపై ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఆమె వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ మాతంగి రమేష్, తహసీల్దార్ రాగ్యానాయక్, ఎంపీఓ మోసిన్ బిన్ అహ్మద్, ఏఈఈ శోభ తదితరులు ఉన్నారు.

ఒక్కో నీటిచుక్క ఎంతో విలువైనది

- ఈఎన్‌సీ శ్రీనివాస్



డ్యాంపై ఈఎన్‌సీ, సీఈ, ఎస్‌ఈ, ఇంజనీర్లు

నాగార్జునసాగర్ : వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగునీటి యాజమాన్యానికి చక్కటి ప్రణాళిక అవసరమని.. ఒక్కో నీటి చుక్క విలువైనదని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్ అన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో కొనసాగుతున్న కాల్వల మరమ్మతు, ప్రాజెక్టులో పనులపై గురువారం హిల్‌కాలనీలోని విజయవిహార్ సమావేశ మందిరంలో నల్లగొండ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్‌తో కలిసి సమీక్షించారు. అంతకుముందు సాగర్ ప్రధాన డ్యాంతోపాటు గ్యాలరీలు, గేట్లు, స్పిల్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిధుల వినియోగం, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఏ క్షణాన ఆదేశాలు వచ్చినా కాల్వలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది.. అందుకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్యాం ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లికార్జున్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మిర్యాలగూడ : వానాకాలం సీజన్ ప్రారంభమైనందున సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలో రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని, ఇప్పటికే దుక్కులు దున్ని, నార్లు పోసుకుని.. నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలు, కాల్వలు ఎండిపోయి ఉన్నాయని, నీటి విడుదల చేసి చెరువులు, కుంటలు, కాల్వలు ఎండిపోయి ఉన్నాయని, నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని దీనివల్ల భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. నీటి విడుదలపై తక్షణమే స్పష్టమైన ప్రకటక చేయాలని, షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, తిరుపతి రామ్మూర్తి, అప్పారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

ఎంజీయూ పీజీ నాల్గో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పీజీ నాల్గో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణను యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పరిశీలించి మాట్లాడారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని, కాపీయింగ్ పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ అల్వాల రవి, చీఫ్ ఎగ్జామినేషన్ ఆఫీసర్ ఉపేందర్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ ఉన్నారు.

టైరు పేలి లారీ దగ్ధం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

వలిగొండ: టైరు పేలి నిప్పు రవ్వలు ఎగిరిపడి లారీ దగ్ధమైంది. ఈ ఘటన వలిగొండ మండలం అక్కంపల్లి సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నుంచి తవుడు లోడుతో తమిళనాడుకు వెళ్తున్న లారీ మార్గమధ్యలో వలిగొండ మండలం అక్కంపల్లి సమీపంలోకి రాగానే టైరు పేలింది. దీంతో నిప్పు రవ్వలు ఎగిరిపడి మంటలంటుకొని లారీకి పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో భువనగిరి, రామన్నపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలు ఆర్పివేశారు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

రైల్వే స్టాఫ్‌తో వెళ్తున్న రైలు కోచ్‌లో పొగలు



బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన రైలు

బీబీనగర్: వరంగల్ నుంచి హైదరాబాద్‌కు గురువారం రైల్వే స్టాఫ్‌తో వెళ్తున్న రైలు కోచ్‌లో పొగలు వ్యాపించాయి. రైల్వే ట్రాక్ పరిశీలనలో భాగంగా బీబీనగర్ రైల్వే స్టేషన్ మార్గంలో రైల్వే స్టాఫ్‌తో వెళ్తున్న రైలు కోచ్ బ్రేక్ ప్యాడ్స్ పట్టివేయడంతో స్పార్క్ రావడంతో పొగలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది బీబీనగర్ స్టేషన్‌లో ట్రైన్‌ను నిలిపివేసి పొగలను అదుపులోకి తెచ్చి బ్రేక్ ప్యాడ్‌లను సరిచేశారు. అనంతరం ట్రైన్ స్టేషన్‌ను నుంచి వెళ్లిపోయింది.

యువకుడి మృతిపై కేసు నమోదు

మర్రిగూడ: మర్రిగూడ మండలం మేటిచందాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందుర్తి గ్రామంలో బుధవారం అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందగా.. గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. కృష్ణారెడ్డి తెలిపారు. నాంపల్లి మండలం దామెర గ్రామానికి చెందిన బత్తుల సైదులు(25) ఇందుర్తి గ్రామంలో సరిత అనే మహిళ ఇంటి ముందు పురుగుల మందు తాగి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అంతకుముందు మృతదేహాన్ని తమకు చూపించాలని మృతుడి బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించగా.. ఎస్ఐ వారికి సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

సాక్షి క్లాసిఫైడ్స్
Real Estate
HOUSE FOR SALE
■ నకిరేకల్ వద్ద మున్సిపాలిటీ పరిధిలో, తాటికల్ రోడ్, బత్తుల కృష్ణారెడ్డి ఇంటి వెనుక వైపు 120 చ.గ. పిల్లర్స్‌తో నిర్మించిన ఇల్లు అమ్మకమునకు కలదు. నల్గొండ జిల్లా.Ph:6305857812, 9849382952
[SCA25006283]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

‘సుంకిశాల’ పూర్తయ్యేదెన్నడో..!

- పంప్‌హౌస్ పనులు ప్రారంభమై నాలుగు సంవత్సరాలు
- పూర్తిచేయాల్సింది 2022 డిసెంబర్ నాటికే..
- మళ్లీ 2023 మార్చి వరకు గడువు పొడిగింపు
- కూలిన కాంక్రీట్ పిల్లర్ల శిథిలాల తొలగింపు పనులు ప్రారంభం
- పథకం పూర్తికి మరో ఏడాది సమయం పట్టే అవకాశం



సుంకిశాల పంప్‌హౌస్ వ్యూ

పెద్దవూర: పెద్దవూర మండలం పాల్తీతండా సమీపంలోని సుంకిశాల గుట్టపై నిర్మిస్తున్న భారీ ఇన్‌టేక్ వెల్ పంపింగ్ స్టేషన్(సుంకిశాల పథకం) పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం 455 అడుగుల లోతు(డెడ్‌స్టోరేజీ)లో ఉన్నా హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరందించేందుకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్) ఆధ్వర్యంలో రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనుల గడువు పొడిగించినా పూర్తికావడం లేదు. గత ఏడాదే ఒక సొరంగం పూర్తిచేసి జంటనగరాలకు తాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సొరంగంలోకి నీరు రాకుండా కాంక్రీట్ పిల్లర్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్ గతేడాది ఆగస్టు 2న కూలి పంప్‌హౌస్ నీట మునిగింది. ఇప్పటికీ గేట్లు అమర్చేందుకు నిర్మించాల్సిన కాంక్రీటు పిల్లర్లతో కూడిన నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

కొనసాగుతున్న శిథిలాల తొలగింపు

సాగర్ జలాశయంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో గతంలో కృష్ణా బ్యాక్ వాటర్ సొరంగంలోకి నీరు వెళ్లిన ప్రాంతాన్ని పూర్తిగా బంకమట్టి, కంకర, కాంక్రీట్‌తో నింపి పూడ్చివేశారు. జలాశయం పూర్తిగా నిండినా పంప్‌హౌస్‌లో పనులకు ఎలాంటి అవరోధం లేకుండా చర్యలు తీసుకున్నారు. పంప్‌హౌస్‌లో 40అడుగుల లోతులో చేరిన నీటిని ఏడు భారీ మోటార్లతో పూర్తిగా తొలగించారు. గతంలో కూలిపోయిన రిటైనింగ్ వాల్ శిథిలాలను భారీ కట్టర్ మిషన్లతో తొలగించే పనులు జరుగుతున్నాయి. మరో వారంలో ఈ పనులు పూర్తికానున్నాయి. ఇప్పటికే 70 శాతం పూర్తయిన రిటైనింగ్ కాంక్రీట్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. సుంకిశాల నుంచి కోదండపురం వరకు 17 కి.మీ. దూరం, 40 మీటర్ల వెడల్పుతో మూడు వరుసల్లో నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మోటార్లు బిగించే కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణ పనులు పూర్తి కావడానికి మరో ఏడాది పట్టే అవకాశం ఉంది.

ప్రాజెక్టు ఉద్దేశం ఇదీ..

హైదరాబాద్ జంట నగరాలకు కృష్ణా తాగునీటిని



గతేడాది నీట మునిగిన పంప్‌హౌస్ (ఫైల్)

అందించాలన్న ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్రంలో మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో సుంకిశాల పథకానికి శంకుస్థాపన చేశారు. రైతుల ఆందోళనతో ఆ తర్వాత చంద్రబాబు సీఎం అయ్యాక ఆ పనులను పక్కన పెట్టి ఏఎమ్మార్పీ ద్వారా పుట్టంగండి సమీపంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి రంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్‌కు పైపులైన్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జంటనగరాలకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా రూ.1,450 కోట్ల అంచనాతో సుంకిశాల పథకాన్ని చేపట్టింది. నగరం విస్తరణను దృష్టిలో పెట్టుకుని 2035 నాటికి 47.71 టీఎంసీలు, 2050 నాటికి 58.98 టీఎంసీలు, 2065 నాటికి 67.71 టీఎంసీలు, 2072 నాటికి 70.97 టీఎంసీల నీరు అవసరం ఉంటుందన్న అంచనాతో సుంకిశాల ఇన్‌టేక్ వెల్ పంపింగ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. దీంట్లో భాగంగా రూ.317.56 కోట్లు పంప్‌హౌస్ నిర్మాణానికి, రూ.215.77 కోట్లు ఎలక్ట్రో మెకానికల్ పనులకు, రూ.636.5 కోట్లు (సుంకిశాల నుంచి కోదండపురం వరకు 17 కి.మీ. దూరం 40 మీటర్ల వెడల్పుతో మూడు వరుసల్లో) పైపులైన్ నిర్మాణానికి కేటాయించారు. సొరంగాన్ని మూడు స్టేజీల్లో.. సముద్ర మట్టానికి జలాశయంలో 450 అడుగుల లోతులో ఒకటి, 504 అడుగుల లోతులో రెండోది, 547 అడుగుల లోతులో మూడోది నిర్మిస్తున్నారు. జలాశయం ఉపరితలంపై నీటిని సొరంగం ద్వారా పంప్‌హౌస్‌లోకి తరలిస్తారు. మూడు పైపులైన్లను ఒక్కోటి 2.347 మీటర్ల వ్యాసంతో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కోపైపు ద్వారా 90ఎంజీడీ(మిలియన్ గ్యాలన్లు), 410 మిలియన్ లీటర్ల నీరు వెళ్లనుంది. మొత్తం 18 మోటార్లను అమర్చి నిత్యం 12 మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తారు. సంవత్సరానికి 16.5 టీఎంసీల నీటిని ఇక్కడి నుంచి జంటనగరాలకు నీటిని తరలించేలా డిజైన్ చేశారు. ఈ పనులకు 2022 మే 14న నాటి మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు శంకుస్థాపన చేశారు.

సొరంగం పనులకు బ్రేక్

గతేడాది ఆగస్టు 2న సుంకిశాల పంప్‌హౌస్ నీట మునగడంతో సొరంగం పనులకు బ్రేక్ పడింది. వాస్తవానికి ఈ పనులను 2022 డిసెంబర్ నాటికి పూర్తిచేయాల్సి ఉన్నా.. 2023 మార్చి వరకు పొడిగించారు. అయినా పంప్‌హౌస్ నీట మునిగే సమయానికి 70 శాతం పనులే పూర్తయ్యాయి. 450 అడుగుల లోతులో నిర్మిస్తున్న మొదటి సొరంగం 650 మీటర్ల పొడవుకు గాను 610 మీటర్లు పూర్తికాగా, ఇంకా 40 మీటర్ల మేర కావాల్సి ఉంది. రెండో దశ సొరంగం పూర్తికాగా, మూడోది 20 మీటర్ల మేర పనులు కావాల్సి ఉంది. పనులు పూర్తికాకముందే సొరంగం నుంచి వచ్చిన నీటి



సొరంగంలోకి నీరు వెళ్లే ప్రదేశాన్ని పూర్తిగా మూసేసిన దృశ్యం

తాకిడికే కాంక్రీటు పిల్లర్లతో కూడిన నిర్మాణం కూలిపోవడంపై పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వెదిరె రాంచంద్రారెడ్డికి భారతరత్న ఇవ్వాలి

భూదాన్‌పోచంపల్లి: వెయ్యి ఎకరాల భూమిని దానం చేసి భూదానోద్యమానికి శ్రీకారం చుట్టిన ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డికి భారతరత్న ఇవ్వాలని అఖిలభారత సర్వోదయ మండలి అధ్యక్షుడు, రాంచంద్రారెడ్డి మనవడు వెదిరె అరవిందారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో వెదిరె రాంచంద్రారెడ్డి 128వ జయంత్యోత్సవాలను పురస్కరించుకొని ఆయన కాంస్య విగ్రహానికి అరవిందారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినోబాభావే మందిరంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1951లో భూమికోసం సాయుధ పోరాటాలు జరుగుతున్న తరుణంలో ఆచార్య వినోబాభావే కోరిక మేరకు వెయ్యి ఎకరాలు భూమి దానం చేసి వెదిరె రాంచంద్రారెడ్డి ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. కానీ నేడు కొందరు అక్రమార్కులు భూదాన్ భూములను అన్యాక్రాంతం చేస్తూ భూదాన స్ఫూర్తికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే భూదాన బోర్డులో పోచంపల్లి స్థానికులకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించుటకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో అఖిలపక్ష పార్టీలతో పాటు పార్టీయేతర ముఖ్యనాయకులతో పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్ చౌరస్తాలో భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వెదిరె రాంచంద్రారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు తూపునూరి కృష్ణగౌడ్, వెదిరె రాంచంద్రారెడ్డి కుమారుడు వెదిరె సాగర్‌రెడ్డి, వెదిరె రాంచంద్రారెడ్డి సేవాసమితి నాయకులు కొమ్ము లక్ష్మణ్, కరగల్ల కుమార్, మాజీ కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, గునిగంటి మల్లేశ్, చేరాల చిన్న నర్సింహ, ఇబ్రహీంపట్నం అంజయ్య, వంగూరి రాజు, ఎర్ర భిక్షపతి, పెద్దల సన్నీ, బాల్‌నర్సింహ, మల్లేశ్, చేరాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వెదిరె అరవిందారెడ్డి తదితరులు

ముగిసిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు గురువారంతో ముగిశాయి. మూడో రోజు హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు స్వేచ్ఛ అనే నాటిక, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం వారు సంధ్య వెలుగు అనే నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలను భారత ప్రభుత్వ కల్చరల్ ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యుడు మారంరాజు రామచందర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమచారి, పెరుమాళ్ల ఆనంద్, కోమలి కళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సెక్రటరీ ఎంఎల్. నర్సింహారావు, రఘుపతి, జీఎల్. కుమార్, వి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



‘సంధ్యా వెలుగు’ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మున్నా (ఫైల్)

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ కాలనీలో గురువారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కందుకూరి మురళి స్థానిక సాయినగర్ కాలనీలో నివాసముంటున్నాడు. మురళి కుమారుడు మున్నా(24) గతంలో ఓ బాలికతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణలతో అతడిపై కేసు నమోదైంది. ఆ బాలిక అనుకోని పరిస్థితుల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మున్నాపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అతడు జైలు జీవితం గడిపి కొద్దిరోజుల క్రితం బయటకు వచ్చాడు. మనస్తాపానికి గురై మున్నా గురువారం సాయినగర్ కాలనీలో అద్దెకు ఉంటున్న ఇంట్లో బాత్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సి. వెంకటేశ్వర్లు తెలిపారు.

స్వర్ణగిరిలో తిరువీధి ఉత్సవ సేవ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి గురువారం రాత్రి ఆలయ మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవ సేవ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, తిరుప్పావడ సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కర్పూర మంగళహారతుల కార్యక్రమం నిర్వహించారు.



తిరువీధి ఉత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ శివారులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖిలో ప్రైవేట్ హాస్టల్ నిర్వహిస్తున్న దేవరపల్లి నరసింహారెడ్డి బైక్‌పై చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామానికి వచ్చి వెళ్తుండగా.. గ్రామ శివారులోని చాచా దాబా వద్ద వెనుక నుంచి కారు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి కుడి చేతి భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

యువతి అదృశ్యం

చిట్యాల: పరిశ్రమలో పనిచేసేందుకు వచ్చిన వలస కుటుంబానికి చెందిన యువతి అదృశ్యమైంది. గురువారం చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కైలాస్ బన్సాల్ తన భార్యాపిల్లలతో కలిసి చిట్యాల మండలం ఏపూరు గ్రామంలోని డీఈసీ పరిశ్రమలో పనిచేసేందుకుగాను నెల రోజుల క్రితం ఇక్కడకు వచ్చారు. వారంతా పరిశ్రమ ఆవరణలోని ఇంట్లో ఉంటూ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 13న అర్ధరాత్రి కైలాస్ బన్సాల్ కుమార్తె నీలు బన్సాల్ ఇంట్లోంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా తన కుమార్తె ఆచూకీ లభించకపోవడంతో గురువారం కైలాస్ బన్సాల్ చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫైర్ సిబ్బంది సేవలు అభినందనీయం



అగ్నిమాపక కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీ నాగిరెడ్డి, విప్ అయిలయ్య, ఎమ్మెల్సీ సత్యం




అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వినియోగించే పరికరాల గురించి వివరిస్తున్న డీజీ నాగిరెడ్డి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

యాదగిరిగుట్ట: విపత్తులు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అగ్నిమాపక సిబ్బంది చూపే తెగువ అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కొనియాడారు. యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గోశాలలో రూ.60 లక్షలతో నిర్మించిన అగ్నిమాపక కేంద్రం భవనాన్ని గురువారం రాష్ట్ర విపత్తులు, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రెస్క్యూ చేయడం గొప్ప విషయమన్నారు. డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బందిని పెంచామని వెల్లడించారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు తక్షణమే 101కి సమాచారం అందించాలని సూచించారు. అంతకుముందు అగ్నిమాపక పరికరాలు, ఫైరింజన్లను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ హరినాథ్‌రెడ్డి, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, జిల్లా అగ్నిమాపక కేంద్ర అధికారి మధుసూదన్‌రావు, ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, పట్టణ సీఐ భాస్కర్, వివిధ జిల్లాల అగ్నిమాపక అధికారులు అశోక్, ఆవుల వెంకన్న, ధనుంజయరెడ్డి, రెహమాన్‌బాబు, యాదగిరిగుట్ట ఫైర్‌స్టేషన్ ఆఫీసర్లు అబ్దుల్ అమీద్, మధుసూదన్‌రెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, సెక్మెట్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ (దాత) ఉమా గండూరి తదితరులు పాల్గొన్నారు.

561 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నీటి మట్టం గురువారం సాయంత్రానికి 561 అడుగులకు (235 టీఎంసీలు) చేరింది. శ్రీశైలం జలాశయం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 67896 క్యూసెక్కుల నీరు సాగర్‌కు విడుదలవుతోంది. గడిచిన 24 గంటల్లో శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 57,103 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. సాగర్ నుంచి విద్యుదుత్పాదన ద్వారా 4419 క్యూసెక్కుల నీటిని దిగువన టెయిల్ పాండ్‌లోకి విడుదల చేశారు. తిరిగి 4,630 క్యూసెక్కులను రివర్స్ పంపుల ద్వారా సాగర్ జలాశయంలోకి ఎత్తి పోశారు.



561 అడుగుల వద్ద సూచిస్తున్న నీటి మట్టం

భూ వివాదంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- అన్న, అతడి భార్యపై దాడి చేసిన తమ్ముడు, అతడి భార్య

మోతె: అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూమి తగాదాలో భాగంగా తమ్ముడు అన్నను రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటన మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిపహాడ్ గ్రామానికి చెందిన గునగంటి వెంకన్న, అనసూర్య దంపతులకు ముగ్గురు కుమారులు రమేష్, ఉపేందర్, చంద్రశేఖర్, ఒక కుమార్తె సంతానం. వెంకన్న, అనసూర్య దంపతులకు 21 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని వెంకన్న తన ముగ్గురు కొడుకులు 5 ఎకరాల చొప్పున పంచి ఇచ్చాడు. మిగిలిన 6 ఎకరాల భూమిని వెంకన్న తన పేరిటే ఉంచుకున్నాడు. కొంతకాలం నుంచి అన్నదమ్ములు రమేష్, ఉపేందర్ మధ్య గెట్లు పంచాయితీ నడుస్తోంది. ఇదే విషయమై గతంలో వీరు ఒకరిపై ఒకరు పోలీసు కేసులు పెట్టుకున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గునంటి ఉపేందర్, అతడి భార్య జ్యోతి కలిసి వ్యవసాయ పొలం వద్ద రమేష్‌తో గొడవపడ్డారు. ఈ క్రమంలో రమేష్ ముఖంపై రాళ్లతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అంతేకాకుండా ఉపేందర్ భార్య జ్యోతి.. రమేష్ భార్య సరితపై దాడి చేయడంతో సరితకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం వారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి చిన్న తమ్ముడు గునగంటి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపేందర్, అతడి భార్య జ్యోతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. గొడవ జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్న పెద్దమనుషులు ఉన్నప్పటికీ నోరు మెదపలేదని ఫిర్యాదుదారుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు.



తమ్ముడి దాడిలో గాయపడిన రమేష్

పోగొట్టుకున్న బంగారం, వెండి బాధితులకు అప్పగింత

పెద్దవూర: ఆటోలో పోగొట్టుకున్న బంగారు, వెండి ఆభరణాలను గంట లోపే పెద్దవూర పోలీసులు గుర్తించి బాధితులకు అప్పగించారు. గురువారం పెద్దవూర ఎస్ఐ వై. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం పర్వేదుల గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వేముల కనకయ్య, అతడి భార్య సింహాచలం గురువారం మధ్యాహ్నం మిర్యాలగూడలో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లటానికి సిద్ధమయ్యారు. సింహాచలం తన బంగారు, వెండి ఆభరణాలతో పాటు దుస్తులను సంచిలో పెట్టుకుంది. వారు స్వగ్రామంలో ఆటో ఎక్కి పెద్దవూరలో దిగారు. ఆటో దిగే సమయంలో తమ వెంట తెచ్చుకున్న సంచిని అందులోనే మరిచిపోయారు. కొద్దిసేపటి తర్వాత తమ వెంట తెచ్చుకున్న సంచి లేదని గమనించిన వృద్ధ దంపతులు రోడ్డు పక్కన కూర్చొని విలపిస్తుండగా.. స్థానిక యువకులు గమనించి వారిని పెద్దవూర పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు విషయం చెప్పారు. పోలీసులు వెంటనే సీసీ కెమెరాలను పరిశీలించి వృద్ధ దంపతులు పర్వేదుల నుంచి ఎక్కి వచ్చిన ఆటో హైదరాబాద్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఆటో నంబర్‌ను పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి, చింతపల్లి పోలీస్ స్టేషన్లకు పంపించగా.. చింతపల్లి మండలం మాల్‌లో అక్కడి పోలీసులు ఆటోను పట్టుకున్నారు. ఆటోను తనిఖీ చేయగా.. సీటు వెనకాల సంచి ఉన్నట్లు గుర్తించారు. వాస్తవంగా ఆటో డ్రైవర్ కూడా ఆ సంచిని గమనించలేదు. పెద్దవూర పోలీసులు చింతపల్లికి వెళ్లి ఆటోను, ఆభరణాలు ఉన్న సంచిని పెద్దవూరకు తీసుకొని వచ్చారు. సంచిలో 15 తులాల వెండి కాళ్ల పట్టీలు, రెండున్నర తులాల బంగారు నాంతాడు, 2 తులాల వెండి మట్టెలు, బంగారు ముక్కుపుడకతో పాటు దుస్తులు ఉండగా.. వాటిని వృద్ధ దంపతులకు అప్పగించారు. గంట వ్యవధిలోనే పోగొట్టుకున్న ఆభరణాలను గుర్తించి బాధితులకు అప్పగించిన హెడ్ కానిస్టేబుల్ ఇద్దయ్య, కానిస్టేబుళ్లు కిషన్ నాయక్, లోకేష్‌రెడ్డి, రాజు, వెంకన్న, శ్రీకాంత్, సైదిరెడ్డి, హుస్సానాయక్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



పోగొట్టుకున్న సొత్తును వృద్ధ దంపతులకు అప్పగిస్తున్న ఎస్ఐ ప్రసాద్

అరచేతిలో వాతావరణ సూచనలు

- రైతుల కోసం మేఘ్ దూత్ మొబైల్ యాప్..
- పిడుగులను గుర్తించేందుకు దామిని యాప్‌ను తీసుకొచ్చిన భారత వాతావరణ శాఖ

త్రిపురారం: రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారంతో పాటు పిడుగుల హెచ్చరికల కోసం భారత వాతావరణ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా మేఘ్ దూత్, దామిని యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. మేఘ్ దూత్ యాప్ ద్వారా రాబోయే ఐదు రోజుల వాతావరణ సమాచారంతో పాటు వారం క్రితం సమాచారం కూడా రైతులు తెలుసుకోవచ్చు. అంతేకాకుండా పంటలకు రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రధాన పంటల్లో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యలను తెలుసుకోవచ్చు. మేఘ్ దూత్ యాప్ ద్వారా ప్రతి మంగళవారం, శుక్రవారం ఆగ్రో- మెట్ ఫీల్డ్ యూనిట్లు, జిల్లా ఆగ్రో- మెట్ ఫీల్డ్ యూనిట్లు పరస్పరంగా వివిధ పంటల సమాచారాన్ని రైతులకు ఎస్ఎంఎస్ ద్వారా అందిస్తుంది. అదేవిధంగా ఏటా వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడి మూగ జీవాలు, రైతులు, పశువుల కాపరులు ప్రాణాలు కోల్పోతున్నారు. పిడుగులను ముందుగానే పసిగట్టడానికి దామిని యాప్‌ను ప్రవేశపెట్టారు. ఈ యాప్ 500 మీటర్ల కంటే తక్కువ వ్యాసార్థంలో పిడుగులు పడే పరిధిని గుర్తించి సమాచారం అందిస్తుంది. దీంతో రైతులు ముందుగానే సురక్షిత ప్రాంతాలలకు చేరుకోవచ్చు.

యాప్‌ల డౌన్‌లోడ్ ఇలా..

ఫోన్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి మేఘ్ దూత్(ఇంగ్లిష్‌లో) అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత సైన్‌అప్‌పై క్లిక్ చేసి పేరు, ప్రాంతం, ఫోన్ నంబర్, భాష, రాష్ట్రం, జిల్లా నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. తిరిగి లాగిన్‌పై క్లిక్ చేసి ఫోన్ నంబర్ నమోదు చేసి లాగిన్ కావాలి. యాప్ ఓపెన్ చేసిన తరువాత స్క్రీన్‌పై వాతావరణం వివరాలు చూపిస్తుంది.అదేవిధంగా ప్లేస్టోర్ నుంచే దామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్ అయిన తర్వాత ఓపెన్ చేసి మొబైల్ నంబర్, అడ్రస్, పిన్ కోడ్ నమోదు చేయాలి. అనంతరం జీపీఎస్ లోకేషన్‌కు అనుమతి ఇస్తే యాప్ పనిచేయడం ప్రారంభమవుతుంది.



మేఘ్ దూత్ యాప్



దామిని యాప్

పిడుగులను గుర్తించే మార్గాలు

మీరు ఉన్న ప్రదేశంలో 7 నిమిషాల వ్యవధిలో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుంది. 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే పసుపు రంగులోకి.. 18 నుంచి 25 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులోకి మారుతుంది.